



మరమగ్గాలను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మరమగ్గాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 28: సోమందేపల్లిలో మరమగ్గాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ ఉప సంచాలకుడు (ఆర్డీడీ) రాజారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. కంచి వెంకటేశ్ మరమగ్గంపై నిబంధనలకు విరుద్ధంగా చేనేత రకం చీరలు నేస్తున్నట్లు గుర్తించారు. మగ్గాన్ని సీజ్‌చేసి, వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. ఆర్డీడీ రాజారావు మాట్లాడుతూ.. చేనేతకు సంబంధించిన 11 రకాల ఉత్పత్తులను మరమగ్గాలపై నేయడం నేరమన్నారు. సోమందేపల్లిలో చాలామంది మరమగ్గాలపై చేనేత చీరలను నేస్తున్నారన్నారు. పలుమార్లు దాడులు చేసినా.. వారి తీరులో మార్పు రాలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల రాక సమాచారం అందుకున్న మరమగ్గాల నిర్వాహకులు ప్లాంట్లకు తాళాలు వేసుకుని, వెళ్లిపోయారు. దాడుల్లో రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మనోహరన్, టెక్నికల్ సూపరింటెండెంట్ షణ్ముగం, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాద నివారణ చర్యలు చేపట్టండి: కలెక్టర్




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 28: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలో మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్దప్రమాదాలకు దారితీస్తుందన్నారు. వాటిని నివారించేందుకు కార్మిక, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ.. ప్రమాదం, విపత్తు తలెత్తినపుడు తక్షణం ఎలా స్పందించాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలన్నారు. ప్రమాదాల సమయంలో చర్యలు తీసుకునేందుకు ప్రతిషిఫ్టులో బాధ్యతాయుతమైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ప్రమాదాలపై పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతోపాటు సమీపప్రాంతాల్లో నివసించే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, పరిశ్రమల శాఖాధికారి కేశవులు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా, అగ్నిమాపక శాఖాధికారి హేమచంద్రారెడ్డి, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెదబల్లి జలాశయం



నిండుగా నీరు.. ఆయకట్టు కన్నీరు



నంబులపూలకుంట మండలంలోని పెదబల్లి జలాశయం ఆయకట్టుకు నీరిచ్చిందే లేదు. జలాశయం ఉందంటే ఉంది.. ఆయకట్టుకు మాత్రం ప్రయోజనం శూన్యం. సరైన సమయంలో ఆయకట్టుకు నీరివ్వకపోతుండడంతో రైతులు గతంలో పంటలు నష్టపోవాల్సి వచ్చింది. కాలువలకు మరమ్మతులు చేపట్టక పూడిపోవడంతో ఆయకట్టుకు నీరివ్వలేని దుస్థితి నెలకొంది. ఈ కారణాలతో రైతులు ఆయకట్టులో పంటలు సాగు చేయలేక వదిలేశారు. చాలామంది పొట్టకూటి కోసం వలస వెళ్లారు. జలాశయం నిర్మించి రెండు దశాబ్దాలు దాటినా.. ఒక్కసారి కూడా ఆయకట్టుకు నీరిచ్చిన పాపానపోలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయం నిండుకుంది. ఆయకట్టుకు నీరివ్వడంపై మాత్రం అయోమయం నెలకొంది. కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథా అవుతోంది.

\- నంబులపూలకుంట

- నీరున్నా వదలని అధికారులు
- కలుపు మొక్కలతో నిండిన కాలువలు
- మరమ్మతుల ఊసేలేదు
- అన్నదాతకు ఆవేదన

పెదబల్లి జలాశయం వద్ద విచిత్ర పరిస్థితి

రైతు ఆశలు అడియాసలు..

ఈ ప్రాంతం ఎంతో వెనుకబడింది. వర్షాధారంపైనే పంటలు సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పెబడల్లి, బలిజపల్లి గ్రామాల పరిధిలో కొండల మధ్యలో 2003లో పాపాఘ్ని నదిపై జలాశయాన్ని నిర్మించారు. జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 0.139 టీఎంసీ. 1500 ఎకరాల ఆయకట్టును సాగులోకి తేవాలనుకున్నారు. రెండు దశాబ్దాలు గడిచినా.. ప్రాజెక్టు కింద పంటలు మాత్రం సాగవట్లేదు. గతంలో పలుమార్లు రైతులు పొలాలను దుక్కి చేసుకుని, సాగుకు సిద్ధమైన సమయంలో నీరివ్వలేదని బాధితులు వాపోతున్నారు. అదును దాటిపోయాక నీరివ్వడంతో రైతులు ఆయకట్టులో సాగుకు వెనకడుగు వేస్తున్నారు. ఇటీవల ఖరీఫ్‌లో అతి తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేశారు. జలాశయం కింద పూర్తిస్థాయిలో పంటలు ఎప్పుడు సాగవుతాయా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జలాశయం కింద పంటల సాగుకు 16 డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం 11 డిస్ట్రిబ్యూటరీలకే నీరు సరఫరా అవుతోంది. ఆయకట్టు భూములను సోలార్ ప్రాజెక్టుకు కోల్పోవడంతో ప్రస్తుతం 1400 ఎకరాలకు తగ్గిపోయింది. ఈ ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగయితే యర్లంపల్లి, పెదబల్లి, గొల్లపల్లి, బత్తినగారిపల్లి, పాపాన్నగారిపల్లి, పి.కొత్తపల్లి, బలిజపల్లి గ్రామాల రైతులకు ప్రయోజనం. వారి ఆశలు అడియాసలవుతూనే ఉన్నాయి. జలాశయం నిండి నీరు పాపాఘ్ని నదిలోకి వెళుతుందే తప్ప.. ఆయకట్టుకు మాత్రం చేరట్లేదు.



ప్రధాన కాలువలో పెరిగిపోయిన జమ్ము

కలుపుమొక్కలతో పూడిన కాలువలు

జలాశయంలో ప్రస్తుతం 0.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన కాలువ పూర్తిగా కలుపు మొక్కలతో నిండుకుంది. జమ్ము ఏపుగా పెరిగి కాలువ కూడా కనిపించని పరిస్థితి. పిల్లకాలువలు సైతం పూడిపోయాయి. ప్రధాన కాలువగుండా నీరు వెళ్లినా పిల్లకాలువలు పూర్తిస్థాయిలో మూసుకుపోయాయి. పిల్ల కాలువలకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వకపోవడంతో పనులు కూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రధాన కాలువలోనైనా ఏపుగా పెరిగిన కలుపును తొలగిస్తే కొంతవరకు నీరు ముందుకు పారే అవకాశం ఉంటుంది.

యర్లంపల్లి ఖాళీ

పెదబల్లి జలాశయం నిర్మాణంతో రైతులు ఎంతో సంబరపడ్డారు. తమ భూముల్లో పంటలు పండిచుకోవచ్చని ఆశపడ్డారు. ఏళ్లుగా భూములకు నీరందక బీడుగా మారడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. వ్యవసాయం వదిలి, కూలిబాట పట్టారు. పట్టణ ప్రాంత్రాలకు వలస వెళ్లారు. యర్లంపల్లి పూర్తిగా ఖాళీ అయింది. గ్రామంలో చాలా కుటుంబాలు వలస వెళ్లాయి. మదనపల్లి, బెంగళూరు తదితర ప్రాంతాల్లో కూలిపనులు చేసుకుని, కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో పింఛన్‌దారులు తప్ప.. మరెవరూ కనిపించట్లేదు.

ప్రభుత్వాన్ని కోరతాం

పెదబల్లి జలాశయం కింద పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరతాం. కాలువల్లో పేరుకుపోయిన జమ్మునుకూడా ఉపాధి హామీ పనుల కింద చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.



\- శ్రీహరిశర్మ, సర్పంచ్, పెదబల్లి

వరుణుడు కరుణిస్తే రబీకి సిద్ధం చేసుకోవచ్చు

జలాశయం పూర్తిగా నిండడంతో రైతులు పొలాలను దుక్కి చేసుకుని, సాగుకు సిద్ధం చేసుకోవచ్చు. రబీకైనా రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటే సాగుకు అవకాశం ఏర్పడుతుంది.



\- రామాంజులు, మాజీ ఎంపీటీసీ, పెదబల్లి

రైతులు కోరితే నీరివ్వడానికి సిద్ధం

ప్రస్తుతం జలాశయంలో నీరు పుష్కలంగా ఉంది. రైతులు కోరితే పంటల సాగుకు నీరివ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే కొంతమేర నీరిచ్చాం. ఇంకా అవసరం ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నీరు వదలాడానికి కృషిచేస్తాం. - రామాంజుల నాయక్, ఏఈ, ఇరిగేషన్

అయోమయం..!

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో మొదలుకాని బదిలీల ప్రక్రియ
- మార్గదర్శకాల కోసం ఎదురుచూపు
- సిఫార్సు లేఖల కోసం ప్రయత్నాలు
- కీలక పోస్టులకు భారీ డిమాండ్
- సంఘాల మాటున బదిలీ తప్పించుకునే ఎత్తుగడ

పుట్టపర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ తుది దశకు వచ్చింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో మాత్రం బదిలీ మార్గదర్శకాలపై సబ్ రిజిస్ట్రార్లలో ఉత్కంఠ నెలకొంది. ఆదాయాన్ని ఆర్జించే శాఖ కావడంతో రెండేళ్లా.. ఐదేళ్లా.. సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారా.. జీరో సర్వీసు అంటారా.. అన్నదానిపై తీవ్రస్థాయిలో చర్చలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో బదిలీల ప్రక్రియ ముందుకు సాగక రాష్ట్ర స్థాయి నుంచి మార్గదర్శకాల కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల బదిలీపై ఉన్న నిషేధాన్ని ఈనెల 19 నుంచి నెలాఖారు 31దాకా సడలిస్తూ సాధారణ బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెలాఖరులోగా ప్రక్రియ ముగించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కొందరు బదిలీల కోసం ఎదురుచూస్తుంటే, మరికొందరు రిక్వెస్టు, ప్రాధాన్య ప్రాంతానికి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో తొమ్మిది రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సబ్ రిజిస్ట్రార్లతోపాటు సీనియర్ అసిసెంట్లు, సిబ్బంది ఉన్నారు. గత వైసీపీ హయాంలో బదిలీలు చాలావరకు అప్పటి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో సాగాయి. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన సబ్ రిజిస్ట్రార్లను నియమించుకున్నారు. ఈనేపథ్యంలో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అడ్డగోలుగా భూరిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయాస్థానాల్లో పైరవీలు చేస్తూ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలకు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.





జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సంఘాల పేరుతో..

చాలామంది సబ్ రిజిస్ట్రార్లు రెండేళ్ల క్రితం బదిలీల నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్లు బదిలీలు చేసినపుడు పైరవీలతో లక్షలు చేతులు మారాయి. కొంత మంది తెలివిగా కొంతమొత్తాన్ని ఉద్యోగ సంఘానికి ఫండ్‌గా ఇస్తే ఏదో ఒక పదవి దక్కుతుందని భావించి పలుఉద్యోగ సంఘాల్లో చేరిపోయారు. అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు ఇలా పలు బాధ్యతల్లో ఉన్నారు. తాజాగా వీరికి స్థానచలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలామందికి అన్యాయం జరుగుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. సంఘాల్లో పదవులను చూసి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వారాదని కొందరు సబ్ రిజిస్ట్రార్లు కోరుతున్నారు. ఉద్యోగ సంఘాల్లో వారి బాధ్యత ఏమిటి, ఆ పదవి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడానికి ఉపయోగపడుతుందా, వ్యక్తి గత ప్రయోజనాలకు వాడుతున్నారా అన్నవి పరిగణనలోకి తీసుకుని, ఎవరికి మినహాయింపులు ఇవ్వాలో ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

భలే మంచి బేరం

జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయంతోపాటు తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో హిందూపురం, చెన్నేకొత్తపల్లి, కదిరి, చిలమత్తూరు. ధర్మవరం, మడకశిర, పెనుకొండ, బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతి పోస్టుకూ మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ ఏడాడి పొడవునా రిజిస్ట్రేషన్ లావాదేవీలు సాగుతున్నాయి. గత వైసీపీ హయాంలో రాజకీయ పలుకుపడి ఉన్నవారికే పోస్టింగ్‌లు దక్కాయి. బదిలీలు కోరుకునే వారందరూ అభ్యర్థన (రిక్వెస్టు) ఫారం పూర్తి చేసి, జిల్లా రిజిస్ట్రార్‌కు పంపాలనీ, సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిసెంట్లు ఇతర కార్యాలయ సిబ్బందికి తాజాగా బదిలీల్లో అందిరినీ దరఖాస్తు చేసుకోవాలని అనధికార ఆదేశాలిచ్చారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు మార్గదర్శకాలు రాకపోవడంతో ఉద్యోగులకు ఎదురుచూపులు తప్పలేదు. నచ్చిన స్థానానికి పోస్టింగ్ కోసం కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పొందే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చెప్పినట్లు నడుచుకుంటామనీ, సిఫార్సు లేఖ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. పెనుకొండ, హిందూపురం, చిలమత్తూరు, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం భలే డిమాండ్ ఉంది. పారిశ్రామిక హబ్‌గా ఉన్న నియోజకవర్గంలో ఐదుగురు సబ్ రిజిస్ట్రార్లు లేఖలు తీసుకున్నట్లు తెలుస్తోంది. హిందూపురం సబ్‌రిజిస్ట్రార్-2 మెడికల్ గ్రౌండ్‌పై అక్కడే పనిచేసేందుకు రిక్వెస్టు సిద్ధం చేసుకున్నారు. చిలమత్తూరులో సబ్ రిజిస్ట్రార్ ఎనిమిది నెలల కిందటే వచ్చారు. మరో ఏడాదిన్నరలో ఉద్యోగ విరమణ ఉంది. ఇక్కడే ఉంచాలని కూటమి నేతల సిఫార్సులు పెట్టినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో లేఖ పట్టు.. నచ్చిన చోటికి పోస్టు కొట్టు అన్న చర్చ సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ల జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లకు జిల్లా పరిధిలోనే బదిలీలు నిర్వహిస్తారు. పైస్థాయి నుంచి బదిలీలపై మార్గదర్శకాలు నేడో.. రేపో.. వస్తాయని భావిస్తున్నా సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

పోలీసులకు పట్టుబడిన వాహనం



గోమాంసం రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

గోరంట్ల, ఆగస్టు 28: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గోమాంసం రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోరంట్లలోని పులేరు రోడ్డులో మార్కెట్ వద్ద గోవులను వధించి, మాంసాన్ని గోరంట్లకు చెందిన ఫక్రుద్దీన్ బొలెరో వాహనంలో బెంగళూరుకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బొలెరో డ్రైవర్ వసీమ్ అక్రమ్ రవాణాకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో అరెస్టు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాంసం వ్యాపారుల బైండోవర్

కొంతకాలంగా గోరంట్ల పశువుల సంతనుంచి కొనుగోలు చేసిన గోవులను వధించి, మాంసాన్ని కొంతమంది యథేచ్ఛగా కర్ణాటకకు తరలిస్తున్నారు. అయినా సంబంధితాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మాంసం తరలిస్తున్న వాహనం పట్టుబడడంతో నూతన సీఐ శేఖర్ దృష్టి సారించారు. గోరంట్లకు చెందిన గోమాంసం రవాణాదారులను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. రిజ్వాన్, ఇమ్రాన్, ఫక్రుద్దీన్, హరీష్, బాబాజీని తహసీల్దార్ రెడ్డిశేఖర్ ముందు బైండోవర్ చేశారు.

తేలికపాటి వర్షం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 28: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అత్యధికంగా నల్లమాడలో 16.6 మి.మీ. వర్షం కురిసింది. సోమందేపల్లి 16.2, లేపాక్షి 15.4, హిందూపురం 13.4, కదిరి 7.2, రొళ్ల 7.2, పెనుకొండ 7.0, చిలమత్తూరు 6.8, పరిగి 4.2, గాండ్లపెంటలో 2.0 మి.మీ. అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు.

వైభవం.. ఉట్లమాను ఉత్సవం





మాఢవీధుల్లో విహరిస్తున్న శ్రీవారు.. ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

కదిరి, ఆగస్టు 28: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఉట్లమాను ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆస్థానపూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. సంప్రదాయంగా యాదవులు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఉట్లమాను ఎక్కడానికి యువకులు ఉత్సాహం చూపారు. చివరకు యువకులు ఒకరిపై ఒకరు ఎక్కి కుండ పగులగొట్టారు. అనంతరం స్వామివారు తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై ఫిర్యాదు



ధర్మవరం, ఆగస్టు 28: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు హైకోర్టు న్యాయవాది అంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వైసీపీకి చెందిన ఇద్దరు నాయకులను క్రమశిక్షణ చర్యల పేరిట చట్ట విరుద్ధంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని ఆయన అన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వ అధికార ముద్ర ఉన్న లెటర్ ప్యాడ్‌ను కేతిరెడ్డి ఉపయోగించారనీ, ఇది చట్టవిరుద్ధమని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్‌కు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. నాయకులను సస్పెండ్ చేయాలనుకుంటే ఆ పార్టీ లెటర్ ప్యాడ్ వినియోగించాలనీ, ప్రభుత్వ అధికార ముద్ర ఉన్న దానిని వాడటం చట్ట వ్యతిరేకమని న్యాయవాది వివరించారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జాతీయ బృందం సభ్యులు

పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ బృందం

కదిరి అర్బన్, ఆగస్టు 28: మండలంలోని పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)న్ని బుధవారం జాతీయ నాణ్యతాప్రమాణాల సంస్థ (ఎన్‌క్యూఏఎస్) వైద్యులు అగస్టీన్ జోసెఫ్, సుధాకర్ సందర్శించారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్నసేవలు, పాటిస్తున్న నిబంధనలు, జాతీయ నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. శానిటేషన్, నీరు, మరుగుదొడ్లు, జాతీయ కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ప్రమీల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రం సిబ్బంది బదిలీలకు బ్రేక్..!

ఖరీఫ్ ఈపంట నమోదు నేపథ్యం

ఇదివరకు సచివాలయ సిబ్బందితోపాటు బదిలీలకు అవకాశం

దరఖాస్తు చేసుకున్న తర్వాత వాయిదా వేస్తూ ఉత్తర్వులు

ఎంపీఈఓలకు న్యాయం చేకూరేనా..?

అనంతపురం అర్బన్, ఆగస్టు 28: రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలకు బ్రేక్ పడింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలను వాయిదా వేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిబ్బందిని బదిలీ చేస్తే ఈ పంట నమోదు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన చెందిన వ్యవసాయ అధికారులు బదిలీలు వాయిదా వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఊరట చెందారు.

దరఖాస్తు చేసుకున్న తర్వాత వాయిదా..

జిల్లావ్యాప్తంగా 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. వీటిలో 244 మంది వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వ్యవసాయశాఖ తరఫున 128 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఉద్యానశాఖ తరఫున 108 మంది విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, పట్టుపరిశ్రమశాఖకు సంబంధించి 8 మంది విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్లు రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా స్థానాల్లో ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. ఒక్కో ఆర్బీకేలో ఒక సిబ్బందిని నియమించారు. అలాగే 410 మంది పశుసంవర్ధక సహాయకులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదివరకు సచివాలయ సిబ్బందితోపాటు రైతు సేవా కేంద్రంలో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, పశుసంవర్ధక శాఖల అసిస్టెంట్లకు బదిలీల అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ఆయా సిబ్బంది ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. షెడ్యూల్ మేరకు ఈనెల 24 నుంచి ఈనెల 27వతేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. బుధవారం ఆన్‌లైన్‌లోని బదిలీల దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు డౌన్‌లోడ్ చేసుకొని, గురువారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. బదిలీలపై అర్జీలు తీసుకున్న తర్వాత ఈనెల 31న బదిలీల ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండింది. అయితే బదిలీల కౌన్సెలింగ్‌కు ఒక రోజు ముందు బుధవారం రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడటం గమనార్హం.

ఇప్పటికైనా న్యాయం చేకూరేనా..?

రైతు సేవా కేంద్రాల్లోని విలేజ్ అసిస్టెంట్లు చేసే విధులే నిర్వర్తిస్తున్న ఎంపీఈఓలకు ప్రభుత్వం న్యాయం చేస్తుందో..? లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా రైతు సేవా కేంద్రం సిబ్బందికి మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అదే రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంపీఈఓలకు బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తాము పనిచేస్తున్న స్థానాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆప్షన్లు ఇస్తే తమ గతేంటని ఎంపీఈఓలు ఆందోళన చెందుతున్నారు. బదిలీలు వాయిదా పడేవరకూ తమ స్థానం ఉంటుందో..? లేదోనని ఎంపీఈఓలు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడారు. ఈ పంట నమోదు, ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ నేపథ్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది బదిలీలు వాయిదా వేయడంతో ఎంపీఈఓలు హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు. మరోవైపు గత వైసీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను తిరిగి జిల్లాకు రప్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం నుంచి కమిషనర్‌కు లేఖ పంపారు. ఎంపీఈఓల సంఘం నాయకులు పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఓడీ రద్దు చేసి ఎంపీఈఓలను జిల్లాకు రప్పించాలని సూచించినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇప్పటికైనా జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న సిబ్బందికి బదిలీల అవకాశం కల్పించాలని ఎంపీఈఓలు కోరుతున్నారు. ప్రస్తుతం బదిలీల గండం గడిచిందని, భవిష్యత్‌లో రైతు సేవా కేంద్రం సిబ్బందితోపాటు తమకు బదిలీలకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని ఎంపీఈఓలు విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఏ మేరకు ప్రభుత్వం ఎంపీఈఓలకు న్యాయం చేస్తుందో వేచిచూడాల్సిందే.



రైతు సేవాకేంద్రం

నగరంలో పీడీఎస్‌యూ రాష్ట్ర వైజ్ఞానిక తరగతులు

సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 28: నగరంలో వచ్చేనెల 2వ తేదీ నుంచి పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక తరగతులు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భాస్కర్, జిల్లా ప్రధానకార్యదర్శి వీరేంద్రప్రసాద్ తెలిపారు. వైజ్ఞానిక తరగతులకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎస్కేయూలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని యాదవ భవన్‌లో నాలుగురోజులపాటు తరగతులు, జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యావ్యవస్థని ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. వర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విద్యారంగానికి శాపంగా మారిన జీవోలు 84, 85, 117 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నగర అధ్యక్షుడు శంకర్, యూనివర్సిటీ నాయకులు తేజ, నరేష్, రాఘవేంద్ర, అబి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పలువురు ఇంజనీర్ల బదిలీ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28: గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పలువురు ఇంజనీర్లు బదిలీ అయ్యారు. మంగళవారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. ఇచ్చిన ఆప్షన్స్‌కు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. శింగనమల డీఈగా ఉన్న గంగాధర్ బుక్కపట్నం డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాడిపత్రి డీఈగా ఉన్న శ్రీరాములును నియమించారు. రాప్తాడు డీఈగా ఉన్న రెహనా వసీం కర్నూలుకు బదిలీ కాగా ఆయన స్థానంలో పులివెందుల నుంచి శ్రీధర్ నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఆపరేషన్స్ అండ్ మెయిన్‌టేనెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులు రాయదుర్గానికి బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న కుసుకుమార్ గుత్తికి, కదిరి డీఈగా వెంకటేశ్వరులు, హిందూపురం డీఈగా శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. శింగనమల ఏఈ శ్రీనివాసులు కుందుర్పికి బదిలీ కాగా.. ఆ స్థానంలో నార్పల ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. గార్లదిన్నె ఏఈ కల్యాణిని అనంతపురం డివిజన్‌కు, బుక్కరాయసముద్రం ఏఈగా ఉన్న జనార్దన్ నార్పలకు బదిలీ అయ్యారు. పుట్లూరు ఏఈగా ఉన్న రామలింగారెడ్డి గుత్తి ప్రాజెక్ట్‌కు, అనంతపురం రూరల్ ఏఈ ఆంజినేయులు పెద్దవడుగూరుకు, ఆత్మకూరు ఏఈగా ఉన్న హరి అనంతపురం రూరల్‌కు బదిలీ చేశారు. వరలక్ష్మిని రాప్తాడుకు, రాప్తాడు ఏఈ వెంకటేష్‌ను బత్తలపల్లికి బదిలీ చేసినట్లు తెలిసింది.

కొత్తగా 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

అనంత, తాడిపత్రి, గుంతకల్లులో ఏర్పాటుకు ఓకే..

అనంతపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం తెలిపారు. దేశవ్యాప్తంగా 234 నగరాలు, పట్టణాల్లో ఎఫ్‌ఎం రేడియోను ప్రారంభించేందుకు మంత్రివర్గం తెలిపింది. అందులో భాగంగా జిల్లాకు 9 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లను కేటాయించారు. జిల్లాలోని అనంతపురం నగరంలో 3, గుంతకల్లు పట్టణంలో 3, తాడిపత్రి పట్టణంలో 3 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం లేకపోలేదు. మాతృభాషలో పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించడంతోపాటు కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించడంలో భాగంగానే ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశంగా కేంద్ర మంత్రిమండలి పేర్కొంది. స్థానిక మాండలికం, సంస్కృతిని పెంపొందించడానికి, స్థానికులకు అవకాశాలు, ఇతరత్రా కార్యక్రమాల ప్రోత్సాహానికి ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు ఉపయోగపడనున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాలో ఆరింటికి ఆమోదం

హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లాలో ఆరు ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. హిందూపురంలో మూడు, ధర్మవరంలో మూడు ఎఫ్‌ఎం స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 28: ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి కాచిగూడ-తిరుపతి-కాచిగూడ మధ్య (వయా గుత్తి) ఆరు ట్రిప్పుల అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (నెం. 07653) రైలు అక్టోబరు 10వ తేదీ నుంచి నవంబరు 4వ తేదీ వరకు ఆరు గురువారాలలో నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు కాచిగూడలో గురువారం రాత్రి పదిన్నరకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10-10 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. అలాగే దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07654) అక్టోబరు 11వ తేదీ నుంచి నవంబరు 15వ తేదీ వరకు ఆరు శుక్రవారాలలో తిరుపతిలో రాత్రి 8-05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు కాచిగూడకు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైళ్లు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్ల మీదుగా పయనిస్తాయన్నారు.

డీఆర్‌ఎంను కలిసిన జీఆర్పీ ఎస్పీ

గుంతకల్లు, ఆగస్టు 28: జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా బుధవారం స్థానిక డీఆర్‌ఎం విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌ఎం కార్యాలయానికి వచ్చిన ఎస్పీ రైల్వేలో భద్రతాసమస్యలపై చర్చించారు. ఆర్పీఎఫ్ పోలీసుల సమన్వయంతో రైళ్లల్లో చోరీలను నియంత్రించడానికి కృషిచేయాలని డీఆర్‌ఎం విజయకుమార్.. ఎస్పీకి సూచించారు.

రేపు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, ఆగస్టు 28: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు సంబంధించి ఈనెల 30వతేదీ నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, వార్డు ఎడ్యుకేషనల్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శి, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శి, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శి బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్

బాగు చేసేందుకు కనీసం పదేళ్లు పడుతుంది

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్





పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్యక్రమానికి హాజరైన పరిటాల శ్రీరామ్

విడపనకల్లు, ఆగస్టు 28: జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని, రాష్ట్రంలోని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, వాటిని గాడిలో పెట్టడానికే కనీసం 10 సంవత్సరాల సమయం పడుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామంలోని మారెమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అయ్యిందని, ఇచ్చిన మాట ప్రకారం వంద శాతం సామాజిక పింఛన్లను పెంచామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉంటుందన్నారు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేస్తుందని అన్నారు. జగన్ ఎక్కడ చూసినా అప్పులు పెట్టి పోయారని, రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. వాటిని తీర్చటానికే ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే, హామీలను నెరవేరుస్తుందని అన్నారు. ఆరోగ్యశాఖను జగన్ అనారోగ్య శాఖగా మార్చారని, రాష్ట్రంలో 14,100 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 13 వేల మంది ఉన్నారని అన్నారు. మిగిలిన 3100 మందిని ఐదేళ్లలో ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకనే జగన్‌మోహన్ రెడ్డి బయటకు వచ్చి అవి చేయలేదు ఇవి చేయలేదు అంటున్నారని, ఆయనది తెలివి తక్కువతనమా..? అవగాహనా రాహిత్యమా..? లేక అహంకారమా అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ప్రజలు కోల్పోయిన అభివృద్ధిని చేసి చూపిస్తామని అన్నారు. కొన్నాళ్లు ఓపిక పడితే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.

గత వైసీపీ పాలనలో ప్రజలపై విద్యుత్ భారం: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 28: రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం వివిధ పేర్లతో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై వేలకోట్లు భారాలు మోపిందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ విమర్శించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణల్లో భాగంగా 2000 సంవత్సరంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి సంబంధించి పోలీసుల కాల్పుల్లో మరణించిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిలకు బుధవారం నీలిమ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 24 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా వామపక్షాలు నిర్వహించిన పోరాటం రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చిందన్నారు. నాడు జరిగిన ఉద్యమ ప్రభావంతో ఆ తర్వాత 12 సంవత్సరాలకుపైగా విద్యుత్ చార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు సాహసం చేయలేకపోయాయన్నారు. రైతులకు నేటికీ ఉచిత విద్యుత్ ఇవ్వడానికి నాటి ఉద్యమమే కారణమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాల్లో భాగంగా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువస్తే, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆ చట్టాన్ని అమలు చేస్తూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం, స్మార్ట్ మీటర్ల పేరుతో అదాని కంపెనీకి వేలకోట్లు దోచిపెట్టారాన్నరు. ఈ నేపథ్యంలోనే ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, వెంకటనారాయణ, మసూద్, రాజు, లక్ష్మీనారాయణ, నూరుల్లా, రామాంజనేయులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శీన, నాగేంద్ర, పుల్లన్న, ఫక్కు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బదిలీల నుంచి ఆరు విభాగాలకు మినహాయింపు

అనంతపురం టౌన్, ఆగస్టు 28: ఆరు విభాగాల గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపునిచ్చారు. గతంలో అన్ని విభాగాల వారికి బదిలీలు వర్తింపుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. తాజాగా సచివాలయాల్లో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్, అనిమల్‌హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీష్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంగ్రేడ్-3 వార్డుహెల్త్ అసిస్టెంట్లకు ఈ బదిలీల నుంచి మినహాయింపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఈ ఆరు విభాగాల సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు ఉండవు.

రోగుల మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, ఆగస్టు 28: జిల్లా సర్వజన ఆస్పత్రిలో మంగళవారం రాత్రి ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగుల మృతిపై విచారణకు కమిటీ నియమించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తాడిపత్రికి చెందిన ఈశ్వరయ్య (38), సత్యసాయిజిల్లా ఎన్‌పీకుంటకు చెందిన నాగయ్య (40) కొన్ని గంటల వ్యవధిలో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఇందుకు డాక్టర్లు, నర్సుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ మరణాలపై వాస్తవ సమాచార సేకరణ కోసం ఆస్పత్రికి చెందిన సీనియర్ వైద్యులు భీమసేనాచారి, రామస్వామినాయక్, నవీన్‌కుమార్‌ను నియమించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. విచారణ అనంతరం నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జీడిపల్లికి 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 28: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం 910 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే రిజర్వాయర్‌లో 1.477 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 28: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ వైద్యాధికారి డాక్టర్ కిష్టయ్య తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీజీ, డిగ్రీ, డిప్లొమో ఇన్ యోగా చేసివుండాలన్నారు. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీ ఉదయం 11 గంటలలోపు దరఖాస్తులను హనుమాన్‌కూడలిలోని ప్రభుత్వ ఆయుష్ వైద్యశాలలో అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి గంటకు రూ.250 చొప్పున వేతనం అందజేస్తారన్నారు. నెలకు 32 గంటలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9440304547 నంబరులో సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 28: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 3800 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు వివరించారు.

చీనీ కాయలు టన్ను రూ.24వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 101 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు. 10 టన్నులు కొనుగోలు: మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో పది టన్నుల టమోటా కొనుగోలు జరిగినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. బుధవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో రూ.10తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు తరలించినట్లు తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి



అజీమ్ (ఫైల్)

ఉరవకొండ, ఆగస్టు 28: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన విద్యార్థి అజీమ్(14) జ్వరంతో బుధవారం మృతి చెందాడు. హోంగార్డు బాబాఫక్రుద్దీన్ కుమారుడు అజీమ్ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఉరవకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. పుట్టినరోజు నాడే మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆర్‌బీఐ క్విజ్ పోటీలకు దరఖాస్తు చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, అధికారులు

పుట్టపర్తి, ఆగస్టు 28: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నారని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. క్విజ్ పోటీల్లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సెప్టెంబరు 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో లీడ్‌బ్యాంకు మేనేజర్ రమణకుమార్‌తో కలిసి క్విజ్‌పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. విద్యార్థులు టీంలుగా ఏర్పడి హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్యూయూఐజడ్.ఐఎన్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు ప్రథమబహుమతి రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.50లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష ఇస్తారన్నారు. జోనల్‌స్థాయిలో ప్రథమబహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు, జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి: ఎస్ఈ



మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, ఆగస్టు 28: విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం, అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ కలెక్షన్లు సకాలంలో వసూలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను సకాలంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, డీఈఈలు లక్ష్మీనారాయణ, రఘు, శ్రీనివాసులు, ఏఈఈలు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా గ్రామాలు




కటకంవారిపల్లి ఎస్సీ కాలనీలో, తూపల్లి వీధిలో మురుగునీటి నిల్వ

- వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- దుర్వాసన, దోమలతో రోగాలబారిన గ్రామీణులు
- కటకంవారిపల్లి, తూపల్లి గ్రామాల దుస్థితి

గాండ్లపెంట, ఆగస్టు 28 : మండలంలోని కటకంవారిపల్లి, తూపల్లి గ్రామాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కటకంవారిపల్లి ఎస్సీ కాలనీలో పరిస్థితి మరీ ఘోరం. మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో వీధుల్లోనే మురుగునీరు ప్రవహిస్తోంది. రెండేళ్లుగా ఈ పరిస్థితి ఉంది. ఇక తూపల్లిలో మురుగు కాలువలు లేకపోవడంతో వీధు ల్లోనే మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో ఈ గ్రామాల్లో దోమలు వృద్ధిచెందడం, దుర్వాసన వస్తుండటంతో గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు.

నాడు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా..

కటకంవారిపల్లి ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువలు పూడికతో పూడిపోయాయి. మురుగునీరు వీధుల్లోకి వచ్చి నిల్వ ఉంటోంది. గ్రామస్థులు రెండు సంవత్సరాలుగా పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లకు విన్నవించినా ఫలితం లేదు. నాటి వైసీపీ ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిం చినప్పుడు ఈ సమస్యను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆంజనమ్మ, భాస్కర్, ఆదినారాయణ, రూపా వాపోతున్నారు. మురుగు సమస్యలపై నాటి వైసీపీ పాలకులు, అధికారులను విజ్ఞప్తులు చేసి.. చేసి.. విసుగొచ్చిందని, ప్రస్తుత పాలకులైనా స్పందించి ఈ సమస్యను పరిష్క రించాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇళ్లముందే మురుగు నీరు

ఇళ్ల ముందే మురుగునీరు నిలువ ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇంటి తలుపులు తీస్తే గుప్పుమం టూ దుర్వాసన వస్తోంది. పిల్లలు ఎక్కడ అనారోగ్యాకి గురవుతారో అని భయంగా ఉంది. రాత్రి సమయంలో దోమలు అధికంగా ఉంటున్నాయి. సమస్యను పలుమార్లు అధికారులు, సర్పం చ్‌లకు విన్నవించినా ఫలితం లేదు. వెంటనే మురుగునీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

- రమేష్, ఎస్సీకాలనీ, కటకంవారిపల్లి



రోగాలు వస్తున్నాయ్

మురుగునీరు నిల్వ ఉండటంతో వీధుల్లోకి రాలేకపోతున్నాం. దోమలు అధికంగా ఉన్నాయ్. దోమల కారణంగా నేను, నా ఇద్దరు పిల్లలు విషజ్వరాల బారిన పడ్డాం. ఇప్పుడు మళ్లీ వర్షాకాలం మొదలైంది. దోమలు మరింత ఎక్కువ అవుతాయి. ఇక ఎలాంటి రోగాలు వస్తాయోనని భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలి.

- మల్లికార్జున, ఎస్సీకాలనీ, కటకంవారిపల్లి

రేపటి నుంచి ఓటరు సర్వే

నల్లమాడ, ఆగస్టు 28: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో తహసీల్దార్ రంగనాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకు ఇంటింటా ఓటరు సర్వే జరుగుతుందన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. నూతన ఓటర్లు నమోదు చేసుకోవాలని, అలాగే ఓటరు కార్డులో చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని అన్నారు.

రేపు అధికారుల సమావేశం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 28: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నోడల్ అధికారి ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు పూల రెడ్డెప్ప తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల మండల అధికారులు తప్పకుండా హాజరుకావాలని, హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని చెప్పారు.

తాటిమానుగుంతలో తాగునీటికి కటకట



అరకొరగా వస్తున్న నీటి కోసం వేచి ఉన్న గ్రామస్థులు

నంబులపూలకుంట, ఆగస్టు 28: మండలంలోని తాటిమానుగుంతలో తాగునీటి ఎద్దడితో నెల రోజులుగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి బోరులో నీరు అడుగంటి పోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. నీరు అరకొరగా వస్తుండటంతో గ్రామస్థులు ఆ బోరు వద్దే వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఒక్కోసారి ఆ నీరు రాకపోతే వ్యవసాయ పొలాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిందే. ఆ గ్రామంలో ఉన్న చేతి పంపు కూడా చెడిపోయింది. ఈ సమస్యలను పలుమార్లు అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వికసిత్ భారత్‌పై సమీక్ష

గాండ్లపెంట, ఆగస్టు 28: స్థానిక ఎంపీడీఓ కార్యాలయలో వికసిత్ భారత్‌పై బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ రామనాయక్ సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ క్రిష్ణానాయక్, ఇరిగేషన్ జేఈ అరుణ, ఏపీఎం సూర్యనారాయణ, ఈఓఆర్‌డీ సునీత పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మనోహర్ బాబు అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఐదు సంవత్సరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిని గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారి ఆంజనప్ప, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, ఎంఈఓ గోపాల్ నాయక్, ఏపీఓ గంగాద్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బర్రెకు వినతిపత్రం అందిస్తున్న సత్యసాయి కార్మికులు

బర్రెకు సత్యసాయి కార్మికుల వినతి

ముదిగుబ్బ, ఆగస్టు 28 : స్థానిక సత్యసాయి నీటి పథకం పంప్ హౌస్ వద్ద సత్యసాయి కార్మికులు ఏడో రోజు సమ్మెలో భాగంగా బుధవారం బర్రెకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఐదు నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని, పీఎఫ్ చెల్లించాలని, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బర్రెకు అందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న సన్ షేడ్

ధర్మవరం, ఆగస్టు 28 : ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశద్వారం (సన్ షేడ్) పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. అది ఎప్పుడు కూలుతుందో... ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆ ప్రవేశ ద్వారం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఆ సన్‌షేడ్‌కు మరమ్మతులు చేపట్టేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

చెర్లోపల్లిలో పొలంబడి

కదిరి(అమడగూరు), ఆగస్టు 28 : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఏఓ వెంకటరమణాచారి పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగకు సోకిన చీడపీడలపై వివరించారు. రసాయనిక పురుగుమందులను అవసరం వరకే వాడాలన్నారు. పండించిన ఉత్పత్తులకు ఇండిగ్రాఫ్ సర్టిఫికెట్లు పొందితే మార్కెట్లో అధిక ధర పొందవచ్చన్నారు. వేరుశనగ పూత దశలో ఉన్న సమయంలో ఎకరాకు రెండు వందల కిలోల జిప్సం వాడితే నూనె శాతం, గింజ బరువు పెరగడంతో అధిక ధరలు పొందవచ్చారు. ఆయన వెంట హార్టికల్చర్ అపర్ణ, సిబ్బంది, రైతులు ఉన్నారు.

ప్రమాదం జరిగితే కానీ స్పందించరా.?

కొత్తచెరువు, ఆగస్టు 28 : స్థానిక యూనియన్ బ్యాంకు వద్ద దిమ్మె నెర్రెలు బారడంతో దానిపై ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక పక్కకు ఒరిగింది. బ్యాంకులో లావాదేవీల కోసం నిత్యం వందలాది మంది ఖాతాదారులు అక్కడి వస్తుంటారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు పడితే... దానికి విద్యుత్ వైర్లు తెగిపడి.. భారీ ప్రమాదం జరిగే అవకాశముంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి.. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు.



ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కార్యకర్తల వల్లే టీడీపీకి పూర్వవైభవం

- ప్రతి కార్యకర్తా.. ఒక సైనికుడే..
- ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం
- పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పరిటాల శ్రీరామ్



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఆగస్టు 28: 'తెలుగుదేశం పార్టీ 2019లో ఓటమి తరువాత చాలా సంక్షోభాన్ని చవిచూసింది. వైసీపీ నాయకులు అష్టకష్టాలు పెట్టారు. దాడులు చేశారు. అక్రమంగా కేసులు బనాయించారు. ఆస్తులు నాశనం చేశారు. అయినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పోరాడారు. పార్టీ గెలుపు కోసం రేయింబవళ్లు కష్టపడ్డారు. వారి వల్లే నేడు పార్టీకి పూర్వవైభవం వచ్చింది. వారి కష్టాని మరిచిపోలేను.' అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీసర్కిల్‌లో గతంలో ఉన్న టీడీపీ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరుకోవడం దానికి మరమ్మతులు చేయించారు. దాన్ని బుధవారం సాయంత్రం ఆయన పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గతంలో ఇక్కడున్న పార్టీ కార్యాలయాన్ని పలు కారణాలతో మరో చోటికి మార్చామన్నారు. అయితే పట్టణానికి మధ్యలో.. ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో మళ్లీ కార్యాలయాన్ని పాత భవనంలోకే మార్చామన్నారు. ఇప్పుడు అధికారంలో ఉండటంతో నాయకులు, కార్యకర్తలపై మరింత బాధ్యత ఉంటుందని, ప్రజలకు మరింత చేరువై.. సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, తెలుగుయువత, తెలుగుమహిళలు, అనుబంధసంఘాల నాయకులు తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, మద్దిలేటి, పణికుమార్, బీరే గోపాలక్రిష్ణ, పురు షోత్తంగౌడ్, బీమనేని ప్రసాద్‌నాయుడు, సంధారాఘవ, మాధవ రెడ్డి, ముత్యాలప్ప నాయుడు, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, కొత్తపేట ఆది, గొట్లూరు శ్రీనివాసులు, రాఘవరెడ్డి, అత్తర్ రహీం, గోసల శ్రీరాములు, మారుతీ, తోట నారాయణస్వామి, పల్లపు రవీంద్ర, బొట్టుకిష్ట, చీమల రామాంజి, చీమల సూరి, తిరుపాల్, నరేశ్ పాల్గొన్నారు.




ధర్మపురి, మద్దన్నగారిపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

ధర్మవరంరూరల్, ఆగస్టు 28 : ప్రబోధ సేవాసమితి, ఇందూజ్ఞాన వేదిక త్రైతసిద్ధాంతం ఆధ్వర్యంలో మండలంలోని ధర్మపురిలో శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి సేవాస మితి సభ్యులు తరలివచ్చారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ముదిగుబ్బ : మండలంలోని మద్దన్నగారిపల్లిలో శ్రీకృష్ణుని ప్రతిమను త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి సభ్యులు బుధవారం ఊరేగించారు. భక్తులు స్వామివారికి పూలమాలలు, టెంకాయలు సమర్పించారు. ఇందులో ప్రబోధానంద సేవాసమితి సభ్యులు నరహరి, వరుణ్ కుమార్, విశ్వనాథ్, రామాంజి, పోతులూరు, హరి, శివ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

ముదిగుబ్బ, ఆగస్టు 28 : ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ కృష్ణంరాజు నాయక్ కడప జిల్లా ఒంటిమిట్టకు బదిలీ అయ్యారు. సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శ్యామ్ రావు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.



శ్యామ్ రావు

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రంగనాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 28: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రంగనాయకులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ అనంతాచారి సెలవుపై వెళ్లడంతో, ఆయన స్థానంలో నల్లమాడ తహసీల్దార్ రంగనాయకులను ఓడీసీ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కదిరి, ఆగస్టు 28: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి కేసీకే నాయక్, డీపీఎంఓ బాలాజీనాయక్ మాట్లాడుతూ... మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షా కాలంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, డయేరియా తదితర వ్యాదులు ప్రబలే అవకాశముందన్నారు. మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది కలిసికట్టుగా శ్రమించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి దోమలను నివారించాలన్నారు. ఈ సమావేశంలో యూపీహెచ్‌సీ మెడికల్ అధికారులు, ఏఎం, ఎంపీహెచ్‌ఈఓలు, సబ్‌యూనిట్ అధికారి, సూపర్‌వైజర్లు, గ్రామ వార్డు కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో 'వార్డ్ వాచ్'

ధర్మవరం, ఆగస్టు 28 : పట్టణంలోని 40వ వార్డు తారకరామాపురంలో వార్డ్ వాచ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి దోమలకు నిలయంగా మారాయి. దీంతో పారిశుధ్య కార్మికులు వాటిని తొలగించారు. ఖాళీప్రదేశాలు, డ్రైనేజీలలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదే విధంగా డ్రైనేజీలను కార్మికులు శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికినీటిని రోడ్లపైకి పారవేయరాదని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి అశోక్ ప్రజలను కోరారు.

హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

దిష్టిబొమ్మతో శవయాత్ర.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

ముదిగుబ్బ, ఆగస్టు 28: హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని సీపీఎం నాయకులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి యూనియన్ బ్యాంకు వరకు దిష్టిబొమ్మతో బుధవారం శవయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పెద్ద మండలమై... దాదాపు 20 వేల జనాభా ఉన్న ముదిగుబ్బలో అనేక సంవత్సరాలుగా హిందువులకు శ్మశాన వాటిక లేకపోవడం బాధాకరమన్నారు. వంకలు, వాగుల వద్ద, రోడ్డు పక్కన సొంత స్థలాల్లో మృతదేహాలను ఖననం చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. పండుగ రోజుల్లో పెద్దలను గుర్తు చేసుకుని టెంకాయలు కొట్టుకోవడానికి కూడా వీలులేకుండా సమాధులు శిథిలమయ్యాయన్నారు. శాశ్వత హిందూ శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని, అందులో అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ మునిస్వామికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహులు, మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేశు, నాయకులు మధు, బాబు, శివకుమార్, బాబ్జాన్, రఫీ, భాషా, నౌషాద్, నారాయణమ్మ, ఫక్రుబీ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

స్కూల్లోకి రానివ్వడం లేదు

- హెచ్‌ఎంపై జడ్పీటీసీకి విద్యార్థుల ఫిర్యాదు
- సోషల్‌మీడియాలో వీడియో వైరల్

బత్తలపల్లి, ఆగస్టు 28: బత్తలపల్లి జక్కంపూటి వెంకటేష్ బాలుర పాఠశాలలోకి తమను హెచ్‌ఎం నాగరత్నమ్మ రానివ్వకుండా కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ఆ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు జడ్పీటీసీ కోటి సుధా వద్ద వాపోయారు. బుధవారం ఆమె ఇంటికి వెళ్లిన విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము పాఠశాలకు సక్రమంగా వెళ్లినా... రెండు వారాలుగా స్కూల్ బయట నిల్చొబెట్టి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. పరీక్షలకు హాజరుకాకుండా బయటకు పంపుతున్నారని, కావాలనే ఆబ్సెంట్ వేస్తున్నారని వాపోయారు. ఈరోజు హెచ్‌ఎం హైదారాబాద్‌కు వెళ్లినా... ఫోన్ చేసి తమను క్లాస్ రూంలో నుంచి బయటకు పంపించారుని బోరున విలపించారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన కూడా తమను పాఠశాలలోకి రానివ్వకుండా గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి బతిమిలాడినా హెచ్‌ఎం పట్టించుకోవడం లేదన్నారు. తమ తల్లిదండ్రులు వెళ్తే వారితో కూడా ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. విద్యార్థుల సమస్యలను వీడియో తీసిన జడ్పీటీసీ.. దాన్ని డీఈఓకు పంపి.. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఇన్‌చార్జి హెచ్‌ఎంతో జడ్పీటీసీ ఫోన్‌లో మాట్లాడారు. దీంతో ఆ విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించి పరీక్షలు రాయించారు. కాగా, ఆ వీడియో సోషల్ మీడియాతో వైరల్ అయింది. దీనిపై ఎంఈఓ చాముండేశ్వరిని వివరణ కోరగా.. తాను కూడా సోషల్ మీడియాలో ఆ వీడియో చూశానని, హెచ్‌ఎం నాగరత్నమ్మతో మాట్లాడగా... విద్యార్థులు సక్రమంగా స్కూల్‌కు రాకపోవడంతో ఇలా చేశానని చెప్పారన్నారు. అయినా స్కూల్‌కు పిల్లలు గైర్హాజర్ అయితే అవగాహన కల్పించాలే తప్పా.. ఇలా శిక్షించరాదని సూచించినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మవరం రూరల్, ఆగస్టు 28: మండలంలోని రేగాటిపల్లి గ్రామానికి చెందిన చంద్రమ్మ (80) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. చంద్రమ్మ భర్త రామకృష్ణారెడ్డి గతంలోనే మరణించాడు. ముగ్గురు కుమారులు, నలుగురు కూతుర్లు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తాడిమర్రి, ఆగస్టు 28 : మండల కేంద్రానికి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కొంకా శ్రీనివాసులు గాయపడ్డారు. పులివెందుల నుంచి ధర్మవరానికి వస్తున్న ఆర్టీసీ బస్సు, ధర్మవరం నుంచి గుడ్డంపల్లి వైపు శ్రీనివాసులు వెళ్తున్న బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ నాగాస్వామి కేసు దర్యాప్తులో ఉందన్నారు.

మహిళపై దాడి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 28 : మండలంలోని వేమారెడ్డిపల్లికి చెందిన రమేష్ తనపై దాడి చేసినట్లు అదే గ్రామానికి చెందిన సుకన్యపై పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చిన రమేష్.. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని, దీంతో తాను కేకలు వేయడంతో తన తలను గోడకు బాది పరుగులు తీశాడని వాపోయారు. విషయాన్ని తన భర్తకు ఫోన్ ద్వారా తెలిపానని, దీంతో ఆయన వచ్చి కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించాడని ఆ ఫిర్యాదులో తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు

నంబులపూలకుంట, ఆగస్టు 28: స్థానిక పెద్దబజారు రామాలయం సమీపంలో నివాసమున్న సతీష్‌బాబు ఇంటి పైకప్పు మంగళవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే కూలింది. ఆ సమయంలో ఇంటిలోవారందరూ మరోగదిలో ఉండడంతో పెద్దప్రమాదం తప్పింది. తమకు ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కూలిన కప్పు

రైలు సమయాన్ని మార్చాలని వినతి



రైల్వే అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

కదిరి, ఆగస్టు 28 : ధర్మవరం, నరసాపురం ఎక్స్‌ప్రెస్ రైలు సమయాన్ని మార్చాలని విజయవాడ దక్షణ మధ్య రైల్వే కార్యాలయంలో డివిజనల్ మేనేజన్ నరేంద్రపాటిల్‌కు బుధవారం వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు రాజధానితో అనుసంధానం చేయడంతో ఈ ప్రాంతవాసులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఈ రైలు ధర్మవరంలో మధ్యాహ్నం 2.20, కదిరికి 3.10 నిమిషాలకు వస్తోందని, విజయవాడకు అర్ధరాత్రి 1.40 నిమిషాలకు చేరుతోందని అన్నారు. ఆ అర్ధరాత్రి సమయంలో విద్యార్థులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ధర్మవరం నుంచి సాయంత్రం 5 గంటలకు ఆ రైలు బయలుదేరితే.. ఉదయం నాలుగు గంటలకు విజయవాడకు చేరుకుంటుందని, ఆ విధంగా వేళలు మార్చాలని కోరినట్లు తెలిపారు. దీనిపై డివిజనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

పనిచేయని నిఘా నేత్రాలు



గాండ్లపెంటలో పనిచేయని సీసీ కెమెరాలు

గాండ్లపెంట, ఆగస్టు 28: స్థానిక నాలుగురోడ్ల కూడలిలో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పనిచేయడం లేదు. చోరీలను అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు.. కొద్ది రోజులుగా పని చేయడం లేదు. వీటి ద్వారా కొత్త వ్యక్తులు, చోరుల కదిలికను గుర్తించడానికి అవకాశం ఉండేది. ఇవి పనిచేయడంతో మండల కేంద్రంలో వరస చోరీలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబధిత అధికారులు చొరవ తీసుకుని ఆ కెమెరాలు పనిచేసేలా చేస్తే.. దొంగలను గుర్తించి.. నేరాలు కరిట్టవచ్చని స్థానికులు కోరాతున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

పెనుకొండ : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో దాదాపు 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు 18-35లోపు వయసు కలిగి, పదో తరగతి నుంచి పీజీ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు దరఖాస్తు, ఆధార్ జిరాక్స్, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకుని రావాలన్నారు.

ఘనంగా శ్రీచక్ర పూజ


శ్రీచక్ర పూజలో పాల్గొన్న మహిళలు

మడకశిరటౌన్, ఆగస్టు 28: శ్రావణమాస మంగళవారం పురస్కరించుకొని పట్టణంలోని షిర్డీసాయినాథుడి మందిరంలో శ్రీచక్ర పూజను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీచక్ర పూజ నిర్వహించారు. అలాగే గురువారం ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు కోరారు.

పశువులకు టీకాలు వేయించండి: ఏడీ

గోరంట్ల, ఆగస్టు 28: మండలంలోని పాడిరైతులు పశువులు, దూడలకు గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లా వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పశువుల నోటిలోను, కాళ్లకు పుండ్లు ఏర్పడి గాలికుంటువ్యాధి తీవ్రత వలన మేత తినలేక, నడవలేని స్థితిలో నీరసించిపోతాయన్నారు. అలాగే నాలుగునుంచి ఎనిమిది నెలల ఆవు దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధిక టీకాలు వేయించుకుంటే, జీవిత కాలంలో వ్యాధి రాదన్నారు. ఈ వ్యాధి సోకిన ఆవు దూడ చూలుకట్టినా, 6, 7 నెలల్లో అబార్షన్ జరుగుతుందన్నారు. చివరి వరకు గర్భం దాల్చినా, సంతానోత్పత్తి జరిగే అవకాశం ఉండదన్నారు. పై రెండు వ్యాధులను అరికట్టడానికి ప్రభుత్వం ఆదేశాలతో పశు వైద్యులు రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి టీకాలు వేస్తున్నారన్నారు. సెప్టెంబరు 19వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 28 : జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డిప్యూటీ డైరెక్టర్‌సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం తుంగోడు, వెలిదడకల గ్రామాల్లో మంగళవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఆ రెండు గ్రామాలకు చెందిన 52ఆవులకు గర్భకోశ చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. సమస్యలున్న ఆవులకు ఈ చికిత్స విధానం ద్వారా ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలాజీ, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐ రాఘవన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సీఐ రాఘవన్

పెనుకొండ టౌన్, ఆగస్టు 28 : పెనుకొండ సీఐగా రాఘవన్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ యుగంధర్ వీఆర్‌కు వెళ్లడంతో... జిల్లా ఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న రాఘవన్ ఆ స్థానంలోకి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానన్నారు. రాజకీయనాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అక్రమాలకు పాల్పడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యతలు తీసుకున్న సీఐని టీడీపీ నాయకులు నారాయణస్వామి, మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు సూరి, రామలింగ, రమణమ్మ, చంద్రకాంతమ్మ, మైనార్టీ నాయకుడు దాదు, తదితరులు కలిసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

నేడు మెగా జాబ్‌మేళా

పెనుకొండ, ఆగస్టు 28: స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడికొండకు చెందిన సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో దాదాపు 20కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు 18-35లోపు వయసు కలిగి, పదో తరగతి నుంచి పీజీ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు ఉదయం 9గంటలకు రెజ్యూమ్‌తో పాటు ఆధార్ జిరాక్స్, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకు రావాలన్నారు.

పురంలో కార్డెన్ సర్చ్

హిందూపురం, ఆగస్టు 28: పట్టణంలోని త్యాగరాజ్‌నగర్, గుడ్డం ప్రాంతాల్లో బుధవారం ఉదయం పోలీసులు కార్డెన్‌సర్చ్ చేపట్టారు. డీఎస్పీ మహేష్ పర్యవేక్షణలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, కరీం, జనార్దన్, సిబ్బందితో కలిసి త్యాగరాజ్‌నగర్ సర్కిల్ నుంచి గుడ్డం ప్రాంతంలో ప్రతి ఇంటినీ సోదా చేశారు. పాత నేరస్థులు, రౌడీషీటర్ల ఇళ్లను, అక్రమ మద్యం, గంజాయి అమ్మిన వారి నివాసాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డులులేని నాలుగు ద్విచక్రవాహనాలను, ఆటోను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

జ్వరాలవ్యాప్తిపై తహసీల్దార్ పరిశీలన


రోడ్డుపై మురుగునీటిని తొలగించాలని సూచిస్తున్న తహసీల్దార్

హిందూపురం(పరిగి), ఆగస్టు 28: డెంగీ, మలేరియా వంటి జ్వరాలపై తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో బుధవారం ఊటకూరులో సర్వే నిర్వహించారు. ఆ గ్రామంలో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందన్న సమాచారంతో ఆయన రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. అపరిశుభ్రమైన ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సర్వేచేసి జ్వరాలబారిన పడినవారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సురేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, ఈఓఆర్డీ, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేద్దాం

గుడిబండ, ఆగస్టు 28 : ప్రతిఒక్కరూ హెచ్‌ఐవీ నిర్మూలనకు కృషి చేయాలని ఐసీటీసీ కౌన్సిలర్ నరసింహులు, టీబీ యూనిట్ అధికారి మురళి పేర్కొన్నారు. గుడిబండ జూనియర్ కళాశాలలో బుధవారంవిద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీనరసమ్మ, లెక్చరర్లు రాందాసు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఆగస్టు 28: పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన మైనొద్దీన్ విషద్రావకం తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఒకటో వార్డుకు చెందిన హసూన్‌అలీ కుమారుడైన మైనొద్దీన్ కుటుంబ కలహాల కారణంగా పట్టణ శివారులోని కళాశాల వద్ద ఉన్న మైదానంలో విష ద్రావకం తాగి అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు గుర్తించి అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ ఉష చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. త్వరలో మైనొద్దీన్‌కు వివాహం జరగాల్సి ఉందని బంధువులు తెలిపారు.

జీఓ 84ను రద్దు చేయాలి

మునిసిపల్ ఉపాధ్యాయుల నిరసన


ఎంజేఎం పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

హిందూపురం, ఆగస్టు 28 : జీఓ 84ను రద్దుచేయాలని మునిసిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంజీ ఎం పాఠశాల వద్ద మునిసిపల్ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీఓ నెంబర్ 84 వల్ల రెండేళ్లుగా మున్సిపల్ విద్యావ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధీనంలోకి మునిసిపల్ విద్యావ్యవస్థను తెచ్చేందుకు గత వైసీపీ పాలనలో ఈ జీఓను తెచ్చారని మండిపడ్డారు. అప్‌గ్రేడ్ కాబడిన పాఠశాలలకు పోస్టులను మంజూరు చేయలేదని, విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించలేదన్నారు. దీంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్ పాఠశాలలతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన విద్యాశాఖ అధికారులు మునిసిపల్ ఉపాధ్యాయులను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. పురపాలక చట్టాలకు అనుగుణంగా... సర్వీసు ఆధారంగా పాఠశాలలకు పోస్టులు మంజూరు చేసి, బదిలీలు చేపట్టాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపట్టాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీఓ రద్దుచేసి మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ హిందూపురం కమిటీ అధ్యక్షుడు చంద్రానాయక్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు పెన్నోబులు, వేణుగోపాల్, మల్లికార్జునరెడ్డి, జనార్దన్, ఇమ్రాన్, హరిప్రసాద్, జగదీష్, నగేష్, కేవవరెడ్డి, రామాంజినేయులు, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జల పాత్రపై దర్యాప్తు చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

హిందూపురం, ఆగస్టు 28: ముంబాయికి చెందిన సినీనటి బాగోతం కేసులో వైసీపీ నేత సజ్జల రామక్రిష్ణారెడ్డి పాత్రపై లోతుగా దర్యాప్తు జరపాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సినీనటీ బాగోతం కేసులో లోతుగా దర్యాప్తు చేయా లని, జగన్ పాలనలో అరాచకం పెరిగిపోయి రాష్ట్ర పాలన అస్తవ్య స్తంగా మారిందన్నారు. దీంతో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయన్నారు. జగన్ పాలనలో పోలీసు వ్యవస్థతో చెడుగుడు ఆడుకున్నారని విమర్శించారు. ఈ తరుణంలో కొంతమంది పోలీస్ అధికారుల ద్వారా పోలీస్ వ్యవస్థను జగన్ దుర్వినియోగం చేశాడన్నారు. వైసీపీ నాయకుడు, సినీనటి మధ్య జరిగిన చీకటి బాగోతాన్ని బయట పెట్టాలన్నారు. పెద్దనేరాలు చేసిన వారిని వదిలేసి చిన్న కేసులో ముద్దాయి అయిన సినీనటిని ముంబాయికెళ్లి అరెస్ట్‌చేసి తీసుకురావాల్సిన అవసరం ఏముందన్నారు. దీనిపై లోతుగా విచారిస్తే సజ్జలతోపాటు వైసీపీ నాయకుల పాత్ర వెలుగులోకి వస్తుందన్నారు.

పొలాలకు దారి కల్పించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంకటరెడ్డిపల్లి రైతులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 28: మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో రైతులకు పొలాలకు దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. వారు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెనుకొండ నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారిలో స్థానిక ట్రస్ట్ ఆధ్వర్యంలో కొంతభూమిని రైతుల నుంచి తీసుకున్నారని, ఆ భూమిలో వెంచర్ వేసినట్లు తెలిపారు. దీంతో దిగువనున్న పొలాలకు వెళ్లడానికి దారిలేక బీళ్లుగా పెట్టుకున్నామన్నారు. అధికారులు స్పందించి పొలాలకు దారి కల్పించాలని కోరారు.

విరివిగా రాగి సాగుచేయండి

వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్

గుడిబండ, ఆగస్టు 28 : రైతులు తరి, మెట్ట భూముల్లో విరివిగా రాగిపంట సాగుచేసి అధిక లాభం పొందాలని వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్, మండల వ్యవసాయాధికారి వీరనరేష్ రైతులకు సూచించారు. స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో వారు బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... రైతులకు ప్రభుత్వం రాగిపంట సాగుచేయడానికి 50శాతం సబ్సిడీతో రాగులను పంపిణీ చేస్తోందన్నారు. రైతులు సబ్సిడీతో అందించే రాగులను తీసుకెళ్లి సాగుచేయాలన్నారు. రైతులు పండించిన రాగులను ప్రభుత్వం క్వింటాల్‌ధర రూ.4,290తో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాగిపంట సాగుచేస్తే ఖర్చులు తక్కువని, ఆదాయం ఎక్కువ వస్తుందని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా

లలితలక్ష్మి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన న్యాయాధికారి లలిత లక్ష్మి

హిందూపురం, ఆగస్టు 28 : స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా లలితలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ మాట్లాడుతూ... కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి లలితలక్ష్మికి సహకరించాలన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయాధికారులు, న్యాయవాదులు కలిసి చొరవ చూపుదామన్నారు. బాధ్యతలు స్వీకరించిన న్యాయాధికారి లలితలక్ష్మికి న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగభూషణ్‌రావు, రంగారెడ్డి, నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిగతుర్పిలో పారిశుధ్య పనులు

గుడిబండ, ఆగస్టు 28: మండలంలోని చిగతుర్పి గ్రామంలో పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్యం పనులు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీలు, మురుగు కాలువలు, పిచ్చి మొక్కలు తొలగించారు. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టి, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో గ్రామంలోని పిచ్చిమొక్కలు తొలగించారు. డ్రైనేజీలు శుభ్రం చేసి ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లినట్లు పంచాయతీ కార్యదర్శి అజయ్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భోజరాజు, కృష్ణమూర్తి, శ్రీధర్, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో గేదెల మృతి


బాధిత రైతుకు ధైర్యం చెబుతున్న గుండుమల తిప్పేస్వామి

రొళ్ల, ఆగస్టు 28: మండల పరిధిలోని బీజీహళ్లిలో యంజారప్ప అనే రైతుకు చెందిన రెండు గేదెలు పాముకాటుతో మృతి చెందాయి. ఈ విషయం పశువైద్యాధికారులకు తెలుపగా మడకశిర ఏడీ అమర్‌నాథ్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పాముకాటుతో మృతి చెందినట్లు పశువైద్యాధికారులు నిర్ధారించారు. రైతు యంజారప్ప వ్యవసాయంతోపాటు గేదెల ద్వారా జీవనోపాధి పొందేవాడు. గేదెలు మృతి చెందడంతో దిక్కుతోచడం లేదని, దాదాపు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సంఘటన స్థలాన్ని సందర్శించి యంజారప్పకు మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దాసి రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, తెలుగుయువత ఉపాధ్యక్షులు బాలకృష్ణ, మండల కార్యదర్శి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించండి

మండల సమావేశంలో సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

హిందూపురం, ఆగస్టు 28 : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు అణిచివేయాలన్నా, ముఖ్యంగా గంజాయిని నిర్మూలించాలన్నా పార్టీలకు అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు సహక రించాలని అబ్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అబ్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ... టీ కొట్టులో కూడా గంజాయి ప్యాకెట్లు దొరికే స్థాయికి వచ్చిందంటే దాని ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అయితే గంజాయి ప్రభావం భవిష్యత్తులో అర్థం అవుతుందన్నారు. ముఖ్యంగా యువత ఈ వ్యసనానికి బానిసైతే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఎక్కడో ఒరిస్సా సరిహద్దులో ఉన్న గంజాయి హిందూపు రంలో కూడా దొరుకుతోందంటే దాని ప్రభావం ఎంతగా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు స్థానిక ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై సభ్యులు మాట్లాడారు. పూలకుంట సర్పంచ్ మంజునాథ్ మాటాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు కావస్తున్నా... ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. సమావేశ భవనంలో ఎందుకు ఫొటోలు ఏర్పాటు చేయలేదని ఎంపీడీఓ నరేంద్రను నిలదీశారు. వెంటనే ఏర్పాటు చేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగభూషణం, ఎంపీడీఓ నరేంద్ర, ఏఓ, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన భూనిర్వాసితుల వంటావార్పు

● పదిరోజుల్లో సమస్య పరిష్కరిస్తాం: డీఆర్‌ఓ


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్

పెనుకొండ, ఆగస్టు 28: గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన నాసిన్, బెల్ కంపెనీలకు భూములు ఇచ్చిన రైతులకు ఆర్అండ్‌ఆర్ చట్టం అమలు చేసి, పరిహారం అందించాలంటూ భూనిర్వాసితులు చేపట్టిన వంటావార్పు నిరసన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. వారు సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెండురోజుల నిరసన క్యార్యక్రమాన్ని మంగళవారం చేపట్టిన విషయం విదితమే. రెండో రోజు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు వెంకటేశ్, మహిళా సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్‌షాద్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 2013భూచట్టాలను అమలుచేసి ఆదర్శంగా ఉండాల్సిన జిల్లాస్థాయి అధికారులు నిర్వాసితులకు పునరావాసం ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పునరావాసాల కోసం మూడేళ్లుగా అడుగుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాల యం డీఏఓకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అందజేశారు. ఈ విషయాన్ని డీఏఓ ఫోన్ ద్వారా డీఆర్‌ఓ భాగ్యరేఖకు తెలియజేశారు. రైతల సమస్యలను పదిరోజుల్లో పరిష్కరిస్తామని డీఆర్‌ఓ హామీ ఇచ్చారని, దీంతో భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలు వాయిదా వేస్తామని సీపీ ఎం నాయకులు తెలిపారు. సమస్యలు పదిరోజుల్లో పరిష్కారం కాని పక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండ వెంకటేశులు, రామాంజినేయులు, రైతులు వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, వెంకటరామిరెడ్డి, వెంకటరాముడు, గంగమ్మ, నరసమ్మ, కదిరప్ప, మారుతి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, (ఇన్‌సెట్‌లో) ఉత్సవ విగ్రహం

మడకశిర(అమరాపురం), ఆగస్టు 28: కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా మండల కేంద్రమైన అమరాపురంలోని దక్షిణ గొల్లహట్టిలో వెల సిన వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తిని దేవాలయం నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. వేదపండితులు హ రీష్ బండార్, నరసింహబండార్ ఆధ్వర్యంలో హోమం చేసి, ఉత్సవ విగ్ర హాన్ని రథంలో ప్రతిష్ఠించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. భక్తులు బొరుగులు, బెల్లం, అరటిపండ్లు రథంపై విసిరి భక్తిని ప్రదర్శించా రు. ఈకార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్ రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గురుమూర్తి, బీకే లింగన్న, వెలుగు దేవరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, డీలర్ కృష్ణమూర్తి, బీసీ చిక్కన్న, అర్చకులు రాజన్న, కాటప్ప, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ శివరాజ్, కృష్ణయాదవ యువసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంధంపూజ


గంధంపూజలో పాల్గొన్న ప్రముఖులు, మతపెద్దలు

పెనుకొండ, ఆగస్టు 28 : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెలసిన బెహలూల్‌షా దర్గా గంధం పూజోత్సవం ఘనంగా ముగిసింది. దర్గా పీఠాధిపతి షెక్షావలి ఇంటి నుంచి గంధాన్ని బుధవారం తెల్లవారుజామున ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి సమాధికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు డా.భాష, మాజీ ఉప సర్పంచ్ కుళ్లాయప్ప, మతపెద్దలు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

మునిసిపల్ అధ్యక్షుడిగా రాజేష్ ఏకగ్రీవం


అధ్యక్షుడిగా ఎన్నికైన రాజేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్ తదితరులు

పావగడ, ఆగస్టు 28: స్థానిక మునిసిపల్ చివరిదశ అధ్యక్షుడిగా 14వ వార్డుకు చెందిన రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పద్నాలుగు నెలల పాటు కొనసాగే మునిసిపల్ అధ్యక్ష స్థానానికి బుధవారం జరిగిన నామినేషన్ ప్రక్రిలో రాజేష్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ వరదరాజులు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన రాజేష్‌కు ఎమ్మెల్యే వెంకటేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు అభినందనలు తెలిపారు. అలాగే మూడో వార్డుకు చెందిన గీత హనుమంతరాయప్ప ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఇదిలాఉండగా అధ్యక్ష పదవి జనరల్ కేటగిరికి వచ్చినప్పటికీ ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితుడైన ఎస్టీ కేటగిరికి చెందిన రాజేష్ ఎంపికపట్ల పలువురు కౌన్సిలర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు సమాచారం.

విద్యార్థులకు ప్రతిభాపోటీలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పావగడ, ఆగస్టు 28 : తాలూకా పరిధిలోని మీనకుంటపల్లి ఎల్‌పీఎస్ పాఠశాలలో కామనదుర్గ, బీకేహళ్లి గ్రామాల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో ప్రతిభా కారంజి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను, కళలను వెలికి తెచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని హెచ్‌ఎం ఆంజనేయులు తెలిపారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి నీరు సమకూరేనా...?

హిందూపురం అర్బన్, ఆగస్టు 28: రాష్ట్రంలోనే వినాయక నిమజ్జనానికి హిందూపురానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి యేటా పురంలో వందలాది విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ఈ సారి మరో అడుగు ముందుకేసి మరింత భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రతి యేటా స్థానిక గుడ్డం కోనేరులో విగ్రహాను నిమజ్జనం చేస్తారు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ సంవత్సరం నిమజ్జనానికి సరిపడేంత నీరు ఆ కోనేరుకు చేరలేదు. మునిసిపల్ అధికారులు ముందస్తు జాగ్రత్తతో నెల రోజుల నుంచి కోనేరును నింపే పనిలో ఉన్నారు. ఇప్పటికి కొంత నీరు వదిలారు. అయితే భారీ వినాయకుల నిమజ్జనం ప్రశ్నార్థకంగా ఉంది.


పైప్‌లైన్ ద్వారా నీటిని వదులుతున్న దృశ్యం


కోనేరుకు చేరిన కొద్దిపాటి నీరు